సాక్షి విశాఖపట్నం
బుధవారం ౹ 8 ౹ ఫిబ్రవరి ౹ 2023



మాజీ ఉపరాష్ట్రపతికి స్వాగతం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పోర్టు చైర్మన్ రామ్మోహన్‌రావు మంగళవారం సాదర స్వాగతం పలికారు. 10లో



అవిగో ఆర్థిక సంఘం నిధులు!

కొన్నాళ్లుగా ఊరిస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.8.50 కోట్లు విడుదలయ్యాయి. 10లో



బై..బై.. వైజాగ్

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ విశాఖకు బై బై చెప్పారు. పుష్ప–2 సినిమా షూటింగ్ ముగించుకొని హైదరాబాద్ బయల్దేరారు. 10లో

న్యూస్‌రీల్

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్



బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ బృందం సభ్యులతో కమిషనర్ రాజాబాబు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్మార్ట్ సిటీస్ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ బృందానికి జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు వివరించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కమిషనర్‌ను ఈ బృంద సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా నగరంలో పలు స్కూళ్లు, పార్కులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులతో పాటు, రోడ్లు, వీధిదీపాలు తదితర అంశాలను కమిషనర్ వారికి వివరించారు. ప్రస్తుతం చేపడుతున్న పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, ఇంకా పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు పలు సూచనలు, సలహాలిచ్చారు.

15న జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం

దాబాగార్డెన్స్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఈ నెల 15న జరగనుంది. ఇప్పటికే స్థాయీ సంఘం సభ్యుల ఆమోదం పొందిన బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చేందుకు బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. 2023–24 ఏడాదికి సంబంధించి రూ.4,063 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. గతేడాది బడ్జెట్ సవరణతో పాటు, కొత్త బడ్జెట్‌పై పాలకవర్గ సభ్యులకు తెలియజేయనున్నారు. రూపొందించిన బడ్జెట్‌లో రూ.3,822.62 కోట్లు జీవీఎంసీకి జమగా చూపారు.

వైఎస్సార్‌సీపీ నుంచి శరగడం సస్పెన్షన్

సాక్షి, అనకాపల్లి : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి చెందిన శరగడం చినఅప్పలనాయుడును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వుల్లో పేర్కొంది.

జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

మహారాణిపేట: జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ప్రారంభించినట్లు జిల్లా సచివాలయ ఇన్‌చార్జి పూర్ణిమాదేవి తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు వేలిముద్రల నవీకరణ నమోదును అప్‌డేట్ చేస్తున్నామన్నారు. గ్రామ,వార్డు సచివాలయాల్లోను ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పర్సనల్ డైరెక్టర్‌గా సురేష్ చంద్ర పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్)గా సెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర పాండే నియమితులయ్యారు. ఇంతకు ముందు డైరెక్టర్ (పర్సనల్)గా విధులు నిర్వహించిన కె.సి.దాస్ గత ఏడాది పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం మంగళవారం పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఇఎస్‌బి) ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెలక్షన్ నిర్వహించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి ఆరుగురు, సెయిల్ నుంచి ఇద్దరు, ఇంజనీర్స్ ఇండియా నుంచి ఒకరు హాజరు కాగా సెయిల్‌కు చెందిన చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర పాండేను ఎంపిక చేసినట్టు పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

బ్యాంక్‌ను మోసం చేసిన అధికారికి జైలు

విశాఖ లీగల్: బ్యాంక్‌ను మోసం చేసిన అధికారికి 2 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.ఎస్.వి.హిమబిందు మంగళవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రు.20,000 జరిమానా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో 3 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు సురేంద్రనాథ్ దత్ సిరిపురం వద్ద గల ఐడీబీఐ బ్యాంక్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేసేవారు. 2014 సంవత్సరానికి ముందు బ్యాంక్ అధికారులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రుణాలను మంజూరు చేశారు. దీనివల్ల బ్యాంక్‌కు లక్షల రూపాయలు నష్టం వచ్చింది. విచారణ జరిపిన సీబీఐ అధికారులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.



షిప్.. షిప్.. హుర్రే!

నౌకల నిర్మాణంలో హిందుస్థాన్ షిప్ యార్డు కొత్త అధ్యాయం

నౌకల నిర్మాణం, మరమ్మతుల విషయంలోనూ హిందుస్థాన్ షిప్ యార్డు తనదైన ముద్ర వేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల నిర్మాణంలో దూసుకుపోతూ.. మరోవైపు సాంకేతికతకు పదును పెడుతోంది. భారత నౌకాదళం కోసం నిర్మిస్తున్న షిప్‌లో తొలిసారిగా 3 మెగావాట్ల భారీ డీజిల్ జనరేటర్ ఏర్పాటు చేసి అబ్బురపరిచింది.

-సాక్షి, విశాఖపట్నం

రూ.2,100 కోట్ల ప్రాజెక్టులో వినూత్న ఆలోచనకు శ్రీకారం

- డైవింగ్ సపోర్టు వెసల్ నిర్మాణంలో భారీ డీజిల్ జనరేటర్ల ఏర్పాటు
- నిస్టార్ షిప్ తయారు చేస్తూ ప్రయోగాత్మకంగా ప్రారంభం
- షిప్‌లో తొలిసారిగా 3 మెగావాట్ల డీజిల్ జనరేటర్ ఏర్పాటు

ప్రపంచ దేశాలకు చెందిన సంస్థలు జత కడుతున్న నేపథ్యంలో నౌకా నిర్మాణంలో హిందుస్థాన్ షిప్‌యార్డు సరికొత్త అధ్యాయాల్ని లిఖిస్తోంది. ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులు, నిర్మాణాలనైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తూ ఆయా సంస్థలకు అప్పగిస్తున్న హిందుస్థాన్ షిప్‌యార్డు దేశంలోనే అతిపెద్ద ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. తాజాగా భారత నౌకాదళం కోసం డైవింగ్ సపోర్ట్ వెసల్ షిప్‌లో తొలిసారిగా 3 మెగావాట్ల భారీ డీజిల్ జనరేటర్ ఏర్పాటు చేసి వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి ఉపక్రమించిన హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) భారత నౌకాదళానికి చెందిన షిప్ తయారీలో ప్రత్యేక వ్యవస్థని అందుబాటులోకి తీసుకొచ్చింది. సాంకేతిక సంస్కరణలు చేసుకుంటూ నౌకా నిర్మాణం, మరమ్మతుల విషయంలో తనకంటూ



హిందుస్థాన్ షిప్‌యార్డు

ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. డీఎస్‌సీ డైవింగ్, సబ్‌మెరైన్ రెస్క్యూ ఆపరేషన్ల కోసం ఐఎన్ఎస్ నిస్టార్, ఐఎన్ఎస్ నిపుణ్ యుద్ధనౌకల్ని తయారు చేస్తోంది. తొలిసారిగా యుద్ధ నౌకలో 3 మెగావాట్ల డీజిల్ జనరేటర్ ఏర్పాటు చేసి చారిత్రక అధ్యాయాన్ని లిఖించింది. ఐఎన్ఎస్ నిస్టారాలో గురువారం ఉదయం ఈ భారీ జనరేటర్‌ని ఏర్పాటు చేశారు.

ప్రతి షిప్‌లో 5 జనరేటర్లు

సాధారణంగా ప్రతి యుద్ధ నౌకలోనూ 5 జనరేటర్లు ఉంటాయి. నిర్మాణ సమయంలో మొదటి జనరేటర్ సేవలు ప్రారంభిస్తే.. నౌకా నిర్మాణం దాదాపు పూర్తయినట్లేనని భావిస్తారు. ఈ జనరేటర్ ప్రారంభమైతే.. షిప్‌కు కావాల్సిన విద్యుత్ ఉత్పత్తి మొదలవుతుంది. ఇప్పటివరకూ 2 మెగావాట్ల డీజిల్ జనరేటర్లు మాత్రమే వినియోగించారు. కానీ.. నిస్టార్‌కు మాత్రం 3 మెగావాట్ల జనరేటర్‌ని ప్రత్యేకంగా డిజైన్ చేశారు. షిప్‌యార్డు డిజైన్ మేనేజర్ ఉషశ్రీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు నిరంతరం శ్రమించి దీనిని రూపొందించారు. ఈ జనరేటర్ ప్రారంభంతో నిస్టార్ షిప్ పనులు 90 శాతం వరకూ పూర్తయ్యాయని షిప్‌యార్డు వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది చివరి నాటికి ఐఎన్ఎస్ నిస్టార్‌ను భారత నౌకాదళానికి అప్పగించేందుకు షిప్‌యార్డు బృందం నిరంతరం శ్రమిస్తోంది. ఈ యుద్ధనౌక నిర్మాణ ప్రాజెక్టును రూ.2,100 కోట్ల వ్యయంతో హెచ్ఎస్ఎల్ చేపడుతోంది.

ఐఎన్ఎస్ నిస్టార్ స్వరూపమిదీ..

- ప్రాజెక్ట్ వ్యయం: రూ.2,100 కోట్లు
- బరువు: 9,350 టన్నులు
- పొడవు: 118.4 మీటర్లు
- వెడల్పు: 22.8 మీటర్లు
- స్వదేశీ పరిజ్ఞానం: 80 %

ఇది ఆరంభం మాత్రమే



దేశంలోని 14 షిప్ యార్డులతో పోల్చి చూస్తే.. హిందుస్థాన్ షిప్‌యార్డు నాలుగో స్థానంలో ఉంది. రానున్న రెండేళ్లలో కోల్‌కతా షిప్‌యార్డ్‌ని అధిగమించి మూడో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రాబోయే నాలుగేళ్లలో నంబర్ వన్‌గా నిలిచేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నాం. షిప్ బిల్డింగ్‌లో పురోగతి సాధించాం. 3 మెగావాట్ల డీజిల్ జనరేటర్ ఏర్పాటు వెనుక షిప్ యార్డు ఉద్యోగులు, కార్మికులంతా ఉన్నారు. ఇదే ఊపుతో స్వదేశీ పరిజ్ఞానాన్ని.. దేశీయ పరిశ్రమల్ని మరింతగా ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నాం.

– కమాండర్ హేమంత్ ఖత్రీ, సీఎండీ, హిందుస్థాన్ షిప్‌యార్డ్

పరిశుభ్రంగా విమానాశ్రయ పరిసరాలు

అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, విమానాశ్రయం డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: విశాఖ విమానాశ్రయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన విమానాశ్రయ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విమానాశ్రయం, ఐఎన్ఎస్ డేగ, పోర్టు, జీవీఎంసీ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉండకుండా.. బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఐఎన్ఎస్ డేగాలో కాలువకు అవసరమైన చోట్ల మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కొండగెడ్డ వాగులో పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 10న ఆర్డీవో ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యక్ష తనిఖీ చేసి అవసరమైన నివేదిక సమర్పించాలన్నారు. జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, విమానాశ్రయ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోర్ట్ ట్రస్ట్, ఐఎన్ఎస్ డేగ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా..

- అందరూ సమన్వయంగా పనిచేయాలి
- టీటీడీ చైర్మన్, రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపు
- విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నేతలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల అధ్యక్షులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో సచివాలయాల వారీగా పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి, ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. బుధవారం నుంచే ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు సమావేశాలు ప్రారంభించాలన్నారు. వార్డు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను త్వరితగతిన నియమించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల పార్టీల అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, కరణం ధర్మశ్రీ, మజ్జి చిన్న శ్రీను, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, యు.వి.రమణమూర్తిరాజు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, నియోజకవర్గ సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్, అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, జగనన్న సచివాలయ కన్వీనర్ల ఉత్తరాంధ్ర కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాకీకో కహానీ

- ఎస్‌ఐ, ఇద్దరు హెచ్‌సీ, ఓ కానిస్టేబుల్‌పై చర్యలు?
- ఎస్‌ఐని వీఆర్‌కు, మిగిలిన వారిని ఏఆర్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఈ ఖాకీలు ఒక్కొక్కరిది ఒక్కో కహానీ. ఒక్కొక్కరు ఒక్కో ఆరోపణల్లో చిక్కుకున్నారు. ఉన్నతాధికారుల వేటుకు గురయ్యారు. నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మంగళవారం ఒక ఎస్ఐ, ఇద్దరు హెచ్‌సీ, ఒక కానిస్టేబుల్‌పై బదిలీ వేటు వేయడం పోలీస్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. విధుల్లో అలసత్వం సెటిల్‌మెంట్ల వ్యవహారాలకు పాల్పడే వారిని ఉపేక్షించకుండా చర్యలకు ఉపక్రమించడంతో మిగిలిన వారందరూ ఉలిక్కి పడ్డారు. కేసుల విషయంలో ఉన్నత స్థాయి నుంచి కానిస్టేబుళ్ల వరకు ఏ ఒక్కరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారికి మెమో జారీ చేయడం, బదిలీ, సస్పెన్షన్ వేటు వేస్తుండడంతో అందరిలోను గుబులు రేగుతోంది. తాజాగా నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన బదిలీలు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో అయినట్లు చూపిస్తున్నప్పటికీ ఆరోపణలు కారణంగానే వారిపై బదిలీ వేటు పడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

వీఆర్‌కు దువ్వాడ ఎస్‌ఐ

దువ్వాడ లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.రాధాకృష్ణ వీఆర్‌కు అటాచ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన కారణాలతో బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ.. ఎస్‌ఐపై వచ్చిన ఆరోపణలు కారణంగానే వేటు పడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఒక 304ఏ కేసులో ఒకరి నుంచి లంచం డిమాండ్ చేసిన విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతోనే ఆయనను వీఆర్‌కు అటాచ్ చేసినట్లు పోలీస్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఏఆర్‌కు ఇద్దరు హెచ్‌సీలు.. ఒక పీసీ

పద్మనాభం పోలీస్‌స్టేషన్ లా అండ్ ఆర్డర్ హెడ్‌కానిస్టేబుల్ టి.కాంతారావు, దువ్వాడ లా అండ్ ఆర్డర్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సూరిబాబుతో పాటు పెందుర్తి లా అండ్ ఆర్డర్ కానిస్టేబుల్ ఆర్.సంతోష్‌కుమార్‌లను సీపీ శ్రీకాంత్ సిటీ ఏఆర్‌కు అటాచ్ చేశారు. అయితే విధులలో నిర్లక్ష్యం, సెటిల్‌మెంట్లు, కేసుల నమోదులో తేడాలు వంటి కారణాలపై వీరిని బదిలీ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గత నెలలో కూడా కేసుల నమోదులో తప్పుడు లెక్కలు చూపించిన 8 మంది కానిస్టేబుళ్లకు డీసీపీ సుమిత్ సునీల్‌గరుడ్ మెమోలు జారీ చేశారు. తాజాగా జరిగిన అటాచ్‌మెంట్లతో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించే వారిని ఉపేక్షించేది లేదని సీపీ మరోసారి హెచ్చరికలు జారీ చేసినట్లయింది.

శ్లాబు సీలింగ్ పడి విద్యార్థులకు గాయాలు



కింద పడిన శ్లాబు సీలింగ్ పెచ్చులు



గాయ పడిన విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని పద్మనాభం పంచాయతీ అర్చకునిపాలెంలో ప్రాథమిక పాఠశాల భవనం శ్లాబు సీలింగ్ ఊడి పెచ్చులు పడడంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ పాఠశాలకు రెండు భవనాలు ఉన్నాయి. వీటిని రెండో విడతలో నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసేందుకు వివిధ కాంపోనెంట్‌లకు రూ.12 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇంతవరకు సుమారు రూ.3 లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. ఒక భవనానికి శ్లాబు సీలింగ్, పైన, లోపల ప్లాస్టింగ్ చేశారు. ఈ భవనంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 17 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో శ్లాబు సీలింగ్ ఊడి పెచ్చులు విద్యార్థులపై పడిపోయాయి. ఈ సంఘటనలో ఒకటో తరగతి విద్యార్థి తాలాడ వేదశ్రీకి తలపై బలమైన, మూడో తరగతి చదువుతున్న ఈమె అన్నయ్య ప్రేమ్ చంద్‌కు వీపు, తలమీద, ఒకటో తరగతి విద్యార్థి పసుమర్తి నిత్యశ్రీకి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో వేదశ్రీ, ప్రేమ్ చంద్‌లను 108 అంబులెన్సులో విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చేర్పించారు. ఘటనపై పద్మనాభం ఎంఈవో ఎం.శివరాణిని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరా తీశారు. విద్యార్థుల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

ఏయూలో అమెరికా ఎఫ్‌డీఏ సదస్సు

ఏయూక్యాంపస్: ఏయూ వేదికగా అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(యూఎస్ ఎఫ్‌డీఏ) సంస్థ ఈ నెల 23, 24 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మంగళవారం ఈ వివరాలు విలేకరులకు వివరించారు. ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా 'కరెంట్ గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్'అంశంపై సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుకు యూఎస్ డ్రగ్ రెగ్యులేటరీ వ్యవస్థ ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ కార్మిలో రోసా హాజరై కీలకోపన్యాసం అందిస్తారన్నారు. ఫార్మా రంగంలో నియంత్రణ వ్యవస్థ పనితీరు, ఔషధ తయారీలో నూతన విధానాలు తదితర అంశాలపై ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో అమెరికాకు చెందిన వయాట్రిస్ గ్లోబల్ క్వాలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవపురాణం, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిశోర్‌బాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎ.ధనుంజయరావు పాల్గొన్నారు. సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆవిష్కరించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వైద్య ఆరోగ్య శాఖలో మళ్లీ నకిలీలు

- రేడియోగ్రాఫర్ పోస్టుల ఎంపికలో అక్రమార్కులకు పెద్దపీట!
- వెయిటేజ్ మార్కుల కోసం నకిలీ సర్టిఫికెట్ల సమర్పణ
- స్పందనలో ఫిర్యాదుతో వెలుగు చూసిన అక్రమాలు
- కేజీహెచ్, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఏడుగురిపై ఫిర్యాదు



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య శాఖలో మరో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగుచూసింది. ఈ సారి రేడియోగ్రాఫర్ పోస్టుల భర్తీలో పలువురు అక్రమార్కులకు పెద్దపీట వేశారన్న విమర్శలు వస్తున్నాయి. కేజీహెచ్, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో అడ్డదారుల్లో ఏడుగురు రేడియోగ్రాఫర్లు పనిచేస్తున్నారని స్పందనలో ఇటీవల ఓ ఫిర్యాదు అందింది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రంగంలోకి దిగి.. అప్పటి నియామకాల్లో ఉద్యోగాలు పొందిన వారి సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు.

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అనుమతితో కేజీహెచ్, వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో రేడియోగ్రాఫర్ పోస్టుల భర్తీకి గత ఏడాది ఆగస్టు 5న అప్పటి డీఎంహెచ్‌వో విజయలక్ష్మి నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలో కంప్యూటర్ రేడియాలజీ అసిస్టెంట్(సీఆర్ఏ), డిప్లమో రేడియోగ్రాఫర్ అసిస్టెంట్(డీఆర్‌జీఏ), డిప్లమో మోడల్ ఇమేజింగ్ టెక్నీషియన్(డీఎంఐటీ) కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు రేడియోలజీ పోస్టులకు అర్హులుగా నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ బోర్డు(ఏపీపీఎంబీ)లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. కానీ ఇక్కడే తేడా జరిగింది. రాష్ట్రంలో లేని కోర్సు చేసిన వారితో పాటు ఏపీపీఎంబీ అనుమతి లేని వారి నుంచి అధికారులు ముడుపులు తీసుకొని ఉద్యోగాలు కట్టబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది బీఎస్సీలో రేడియాలజీ ఇమేజింగ్ టెక్నీషియన్(ఆర్‌టీఐ) అనే కోర్సులో చదివినట్టుగా సరిఫికెట్లు తీసుకొచ్చి ఉద్యోగం సంపాదించినట్లు తెలుస్తోంది. అయితే ఈ కోర్సు రాష్ట్రంలో ఎక్కడా లేదు. అలాగే ఏపీపీఎంబీ వద్ద రిజిస్ట్రేషన్ చేయలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఏడుగురు ఉద్యోగాలు పొందారని.. దీనిపై విచారణ జరిపించాలని కొంత మంది స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖలో వరుసగా ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల స్టాఫ్ నర్సు పోస్టుల్లో వెయిటేజ్ మార్కుల కోసం కొందరు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన సంగతి తెలిసిందే. అంతకు ముందు పలు పోస్టుల్లో నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి.. ఆ తర్వాత తనిఖీల్లో ఉద్యోగాలు కోల్పోయిన ఘటనలూ వెలుగుచూశాయి.

ముడుపుల కోసం కక్కుర్తి

డబ్బుల కోసం కొంత మంది అధికారులు కక్కుర్తి పడుతున్నారు. ఇందుకోసం వెయిటేజ్ మార్కులను ఉపయోగించుకుంటున్నారు. కోవిడ్‌లో ఏడాది కాలం పాటు పనిచేసిన రేడియోగ్రాఫర్లకు ప్రభుత్వం 10 వెయిటేజ్ మార్కులు కలిపే అవకాశం కల్పించింది. ఆయా కోర్సుల్లో ఉత్తీర్ణత పొందిన ఏడాదికి ఒక మార్కు చొప్పున అభ్యర్థికి 10 మార్కుల వరకు కేటాయించే అవకాశం ఇచ్చింది. ఒక్కో విభాగంలో గరిష్టంగా 10 మార్కులు వేయాల్సి ఉన్నప్పటికీ.. కేజీహెచ్ నుంచి 15 మార్కులతో సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు పొందినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. అనర్హులకు ఉద్యోగాలు రావడంతో కేజీహెచ్, వైద్య విధాన పరిషత్ అధికారులు దోహదపడ్డారని అందులో పేర్కొన్నారు.

సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నాం

కలెక్టర్ ఆదేశాల మేరకు రేడియోగ్రాఫర్లకు చెందిన సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నాం. స్పందనలో వచ్చిన ఫిర్యాదు, అభ్యర్థుల వివరాల కోసం వైద్య విధాన పరిషత్ సమన్వయ అధికారికి లేఖ రాశాం. అక్కడ నుంచి వచ్చిన వివరాలు, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

వివరాలు సేకరిస్తున్నాం

ఉద్యోగాలు చేస్తున్న రేడియోగ్రాఫర్ల నుంచి వివరణ తీసుకుంటున్నాం. కేజీహెచ్ నుంచి సర్టిఫికెట్లు తీసుకున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు.. సూపరింటెండెంట్‌తో మాట్లాడతా. అన్ని వివరాలు సేకరిస్తున్నాం.

–డాక్టర్ రమేష్ కిశోర్, సమన్వయ అధికారి, ఏపీవీవీపీ, విశాఖపట్నం

క్లుప్తంగా

బై..బై.. వైజాగ్



దివ్యాంగుడిని ఎత్తుకున్న అల్లుఅర్జున్

కొమ్మాది: స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ విశాఖకు బై బై చెప్పారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పుష్ప–2 (ది రూల్) సినిమా షూటింగ్ కోసం గత నెల 20న ఆయన వైజాగ్ వచ్చారు. ఫిషింగ్ హార్బర్, పోర్టు, అప్పుఘర్ ప్రాంతాల్లో 18 రోజుల పాటు నిర్విరామంగా సినిమా చిత్రీకరణలో పాల్గొన్నారు. మంగళవారం గాదిరాజు ప్యాలస్, రుషికొండలోని రాడిసన్ బ్లూలో అభిమానులతో ఫొటోషూట్ నిర్వహించారు. ఆ సమయంలో నగరానికి చెందిన ఓ దివ్యాంగుడు అల్లు అర్జున్‌ను కలిసేందుకు వచ్చారు. ఇది గమనించి అల్లు అర్జున్ ఆ దివ్యాంగుడిని ఎత్తుకుని ఫొటో దిగారు. సాయంత్రం ఆయన తిరిగి హైదరాబాద్ పయనమయ్యారు.

సిటీలో 'దిల్ వాలా' షూటింగ్



రాజేంద్రప్రసాద్‌కు సన్నివేశం వివరిస్తున్న దర్శకుడు వీరభద్రమ్

కొమ్మాది: ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ మంగళవారం ఆర్.కె.బీచ్ ప్రాంతంలో సందడి చేశారు. డెక్కన్ డ్రీమ్ వర్క్స్ బ్యానర్‌పై దర్శకుడు వీరభద్రమ్ తెరకెక్కిస్తున్న దిల్‌వాలా సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఆయనపై చిత్రీకరించారు. ఆర్.కె.బీచ్‌తో పాటు అక్కడకు సమీపంలోని ఓ గెస్ట్ హౌస్‌లో హీరో నరేష్ అగస్త్యపై కొన్ని సన్నివేశాలు షూట్ చేశారు. క్రైం, కామెడీ కథాంశంతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు వీరభద్రమ్ తెలిపారు.

జేఈఈలో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చరిత్ర సృష్టించారు. గత రెండేళ్లలో ఇద్దరు విద్యార్థులు ఐఐటీల్లో సీట్లు దక్కించుకుని ఉన్నత చదువులు కొనసాగిస్తుండగా.. ఈ ఏడాది మరో ఇద్దరు విద్యార్థులు ఆ అవకాశాన్ని దక్కించుకోనున్నారు. మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్ ఫలితాల్లో లంకెలపాలేనికి చెందిన సుందరపు శశాంక్(ఎంపీసీ), అదే గ్రామానికి చెందిన ఇందల తేజ్ మైఖేల్(ఈఈటీ) అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీవీఈఓ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్



సుందరపు శశాంక్



ఇందల తేజ్ మైఖేల్

కష్టం విలువ తెలుసు

నా తండ్రి ఆరేళ్ల కిందట చనిపోయారు. అమ్మ లక్ష్మి పశువులను పోషించి.. నన్ను చదివిస్తోంది. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేయడమే నా లక్ష్యం. మంచి ఉద్యోగం సంపాదించి అమ్మను బాగా చూసుకోవాలి. నా సోదరుడు కూడా డిప్లమో చేస్తున్నాడు. ఉన్నత చదువులకు వెళ్లాలని కష్టపడి చదివాను. ఆ అవకాశం దక్కుతున్నందుకు సంతోషంగా ఉంది.

– సుందరపు శశాంక్, లంకెలపాలెం

కంప్యూటర్ సైన్స్ చదువుతా..

ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. అమ్మ మహేశ్వరి కూలి పనులు చేసుకుంటూ నన్ను చదివిస్తోంది. కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్, అధ్యాపకులు మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించారు.

– తేజ్ మైఖేల్, లంకెలపాలెం

చదువుకు పేదరికం అడ్డుకాదు

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల జేఈఈ మెయిన్‌లో ప్రతిభ చూపడం సంతోషంగా ఉందని వృత్తి విద్యా శాఖ జిల్లా అధికారి ఆర్.సత్యనారాయణ అన్నారు. అగనంపూడి జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించి.. ఇద్దరు విద్యార్థులను అభినందించారు. పేదరికం చదువుకు అడ్డురాదని ఈ విద్యార్థులు నిరూపించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రణాళికాయుతంగా విద్యా బోధనతో ఇది సాధ్యమైందన్నారు.

గురుకుల బాలికల ప్రతిభ

మధురవాడ: మారికవలస గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల(ఎస్‌వోఈ) బాలికలు జేఈఈ మెయిన్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. 30 మంది పరీక్షలకు హాజరు కాగా 10 మంది 50పైగా పర్సంటైల్ సాధించారు. వీరిలో కె. సాయిమేఘన 75.1 ఆరిక శ్రీవల్లి 69, వి.శ్వేత కుమారి 63.4 పర్సంటైల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు తెలిపారు.

తిరుమల ప్రభంజనం

ఏయూక్యాంపస్: జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్షల్లో విశాఖపట్నం తిరుమల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు విద్యాసంస్థల అధినేత తిరుమల రావు తెలిపారు. వాసిరెడ్డి వేణు 99.474, పి.నవీన్ కుమార్ 99.47, పాలేరు యశ్వంత్ శ్రీనివాస్ 99.94, కోలా వరుణ్ కుమార్ 99.82, జి.హేమంత్ 99.81, బి.యశ్వంత్ రామ్‌కుమార్ 99.78, టి.నితీష్ 99.78, టి.సతీష్, ఎస్.యశ్వంత్ 99.68 పర్సంటైల్ సాధించారు. 99 పర్సంటైల్ పైన 23 మంది, 98 పైన 45 మంది, 97 పైన 58 మంది, 96పైన 74 మంది 95 పైన 88 మంది, 90 పైన 179, 80 పర్సంటైల్ పైన 324 మంది విద్యార్థులు సాధించారన్నారు.

అవిగో ఆర్థిక సంఘం నిధులు!

- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.8.50 కోట్లు విడుదల
- 42 జెడ్పీటీసీలు, 13 ఎమ్మెల్యేలు..
- వీరికి రూ.13 లక్షల చొప్పున కేటాయింపు
- ఈ నిధులతో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ పనులు
- అంచనాల తయారీలో అధికారులు
- రూ.కోటితో జెడ్పీ కార్యాలయం, గెస్ట్‌రూమ్‌లకు మరమ్మతులు

సాక్షి, విశాఖపట్నం: కొన్నాళ్లుగా ఊరిస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.8.50 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను జిల్లా పరిషత్ పరిధిలోకి వచ్చే 42 మంది జెడ్పీటీసీలు, 13 మంది ఎమ్మెల్యేలకు రూ.13 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని మంచినీరు, సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, డ్రెయినేజీలకు అవసరమైన పనులు చేపట్టనున్నారు. ఇంకా ఎక్కడైనా అవసరమైతే కొత్తగా రోడ్ల నిర్మాణానికి కూడా వెచ్చించనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల సమాచారాన్ని జిల్లా పరిషత్ అధికారులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవోల)కు పంపించారు. ఈ ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సదరు పనులకు అంచనాల తయారీలో ఉన్నారు. నిబంధనల ప్రకారం అంచనాలు రూపొందించి పంపిస్తారు. అనంతరం పనులు చేపడతారు. ఈ పనులు మొదలైతే మార్చి నాటికల్లా పూర్తవుతాయని భావిస్తున్నారు.

జెడ్పీ కార్యాలయానికి మరమ్మతులు

మరోవైపు జిల్లా పరిషత్ కార్యాలయం, ఆ ప్రాంగణంలో ఉన్న ఎనిమిది గెస్ట్ రూమ్‌లు చాన్నాళ్లుగా మరమ్మతులకు గురయ్యాయి. ఈ గెస్ట్ రూమ్‌లు చాలా వరకు వినియోగానికి పనికి రాకుండా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో జెడ్పీ కార్యాలయం, గెస్ట్ రూమ్‌లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నట్టు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర 'సాక్షి'తో చెప్పారు.

జనరల్ ఫండ్ నుంచి రూ.12 కోట్లు

ఇప్పటికే గత ఏడాది జిల్లా పరిషత్ సాధారణ నిధుల (జనరల్ ఫండ్) నుంచి జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలకు రూ.12 కోట్లు విడుదల చేశారు. ఇలా జెడ్పీటీసీలకు రూ.15 లక్షలు, ఎమ్మెల్యేలకు రూ.50.20 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. తాజాగా ఇప్పుడు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో అవసరమైన పనులు చేపట్టడానికి సన్నద్ధమవుతున్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యకు ఘన స్వాగతం

దొండపర్తి: విశాఖలో రెండు రోజుల పర్యటన నిమిత్తం పోర్టు అతిథి గృహానికి చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు పోర్టు చైర్మన్ రామ్మోహన్‌రావు మంగళవారం సాదర స్వాగతం పలికారు. నగరంలో రెండు రోజుల పాటు జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. పోర్టు అతిథి గృహం వద్ద స్వాగతం పలికిన వారిలో పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, ఇతర పోర్టు అధికారులు ఉన్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో సేఫ్టీ రివ్యూ

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో మంగళవారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆధ్వర్యంలో సెంట్రల్ రైల్వే, ముంబయికి చెందిన సేఫ్టీ ఆడిట్ టీం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ డీవై నాయక్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు విభాగాలలో ఆడిట్ నిర్వహించారు. హై లెవల్ సేఫ్టీ బృందం సోమవారం కోరాపుట్–అరకు–విశాఖపట్నం సెక్షన్‌లో సేఫ్టీ తనిఖీలు నిర్వహించింది. మంగళవారం విశాఖలోని యాక్సిడెంట్ రిలీఫ్ రైలు, న్యూ కోచ్ కేర్ సెంటర్, మార్షలింగ్ యార్డ్, ఇతర పని ప్రదేశాల్లో భద్రతాపరమైన తనిఖీలు చేశారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలో రైళ్ల భద్రత, నిర్వహణకు సంబంధించిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ తనిఖీల్లో చీఫ్ ట్రాక్ ఇంజినీర్ ఏకే పాండే, చీఫ్ ఎలక్ట్రికల్ సిగ్నల్ ఇంజినీర్ ఆర్‌బీ దేశ్‌ముఖ్, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్ సుయష్ నారాయణ్, చీఫ్ సిగ్నల్ ఇంజినీర్ పీయుష్ కకర్, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అనిల్‌కుమార్ పట్కే, డిప్యూటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎంపి కోబ్రగడెలతో పాటు వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్రవీణ భటి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ నాయక్, చిత్రంలో డీఆర్‌ఎం అనూప్‌కుమార్

పలు రైళ్లు గమ్యం కుదింపు, మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): రాయ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

గమ్యం కుదించిన రైళ్లు : గురువారం విశాఖలో బయల్దేరవలసిన విశాఖపట్నం– రాయ్‌పూర్ (08528) పాసింజర్ అరంగ మహానాడి వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో రాయ్‌పూర్‌లో 10న బయల్దేరవలసిన రాయ్‌పూర్–విశాఖపట్నం (08527) పాసింజర్ రైలు రాయ్‌పూర్ నుంచి కాకుండా అరంగ్ మహానాడి నుండి బయల్దేరుతుంది.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు : గురువారం విశాఖలో బయల్దేరవలసిన విశాఖ–దుర్గ్ (18530) రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. గురువారం హజరత్ నిజాముద్దీన్‌లో బయల్దేరవలసిన హజరత్ నిజాముద్దీన్ – విశాఖ (12808) సమతా ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి బుధవారం విశాఖ వస్తున్నారు. వందే భారత్ రైలులో విజయవాడ నుంచి రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి రామనగర్‌లోని తన సొంత ఇంటికి వెళతారు. 9న నర్సీపట్నంలో జరిగే ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి ఇంటికి చేరుకుంటారు. 10న ఉదయం 5.45గంటలకు వందేభారత్ రైలులో విజయవాడ వెళతారు.

240 ప్లాట్‌కు వేలం నుంచి మినహాయింపు

దొండపర్తి: కోర్టు కేసు కారణంగా కూర్మన్నపాలెం ఫేజ్–6 లేఅవుట్‌లో 240 ప్లాట్‌కు ఈ–వేలం నుంచి మినహాయిస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లకు ఈ నెల 9న ఈ–వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు గత నెల 30న ప్రకటించినట్లు వివరించారు. 240 నంబర్ గల ప్లాట్‌ను వేలం నుంచి మినహాయించడంతో పాటు దరఖాస్తు చేసుకున్న వారికి ధరావతు సొమ్మును వాపసు చేస్తామన్నారు.

కారు బీభత్సం

ఒకరికి తీవ్ర గాయాలు



వివరాలు సేకరిస్తున్న ఎయిర్‌పోర్టు పోలీసులు

గోపాలపట్నం: అతివేగంగా వచ్చిన కారు ఫుట్‌పాత్‌పైకి దూసుకుపోవడంతో.. ముగ్గురికి గాయాలయ్యాయి. 104 ఏరియాలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాత గోపాలపట్నానికి చెందిన బెల్లాన తిరుపతిరావు మంగళవారం తన సొంత కారులో ఆక్టింగ్ డ్రైవర్‌తో సీతంపేట బయలుదేరారు. బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో మర్రిపాలెం 104 ఏరియాకు వచ్చే సరికి డ్రైవర్ ఉదయ్ కిరణ్‌కు ఫిట్స్ వచ్చింది. దీంతో కారు అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పక్క సందులోనుంచి పాదచారుడు యండమూరి గంగులు అప్పుడే వచ్చాడు. అదే సమయంలో ఒక ద్విచక్రవాహనచోదకుడు ఆగాడు. ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి నిల్చొని ఉన్నాడు. ఇంతలో కారు అతి వేగంగా వచ్చి తొలుత గంగుల్ని ఢీకొట్టడంతో ఒక్కసారిగా అతను ఎగిరి ఫుట్‌పాత్‌పై పడ్డాడు. ఆ వెంటనే ద్విచక్రవాహన చోదకుడిని ఢీకొట్టింది. గంగులు తలకు బలమైన గాయమైంది. ద్విచక్రవాహనచోదకుడు, ఫుట్‌పాత్‌పై నిల్చొని ఉన్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బిల్డింగ్ మెటీరియల్ అమ్మే షాపులో గంగులు కూలీగా పని చేస్తున్నాడు. సీఐ బీఎండీ ప్రసాద్, ఎస్ఐ రామకృష్ణ వివరాలు సేకరించారు.

త్వరితగతిన అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

అధికారులకు ముఖ్యకార్యదర్శి ఆదేశం

ఎంవీపీకాలనీ: త్వరితగతిన అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర అధికారులను ఆదేశించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల అధికారులు, సీడీపీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు, రేషన్, గుడ్లు, పాలు సరఫరా, పంపిణీతో పాటు మెనూ అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా.. రాష్ట్ర కార్యాలయం దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా జిల్లాల మహిళా శిశు సంక్షేమ సంక్షేమం, సాధికారత అధికారులు వెంకటేశ్వరి, ఉషారాణి, సూర్యలక్ష్మి, ఉషారాణి, శాంతికుమారి, గౌరీ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైనాట్‌కు బ్లూస్టార్ గోల్డెన్ అవార్డు



తణుకులో అవార్డు అందుకుంటున్న వైనాట్ అధినేత రాయుడు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్‌కు ప్రముఖ ఏసీ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ గోల్డెన్ అవార్డు దక్కింది. చెన్నై లీలా ప్యాలెస్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైనాట్ గ్రూప్ సంస్థల అధినేత జుజ్జవరపు వెంకటరాయుడుకి బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్, అధ్యక్షులు శశి అరోరా చేతుల మీదుగా అవార్డు అందజేశారు. దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో చైన్ స్టోర్ డివిజన్‌లో పవర్ రిటైలర్ విభాగంలో ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు, సిబ్బందికి రాయుడు అభినందనలు తెలిపారు.

పద్మజ సుజుకికి నెంబర్-1 సేల్స్ అవార్డు



సుజుకి ఎండీ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న వరుణ్‌గ్రూప్ ఎండీ వరుణ్‌దేవ్

దొండపర్తి: సుజుకి 2 వీలర్స్ అగ్రశ్రేణి డీలర్ పద్మజ సుజుకికి సేల్స్‌లో ఆల్ ఇండియా నెంబర్–1 అవార్డు లభించింది. న్యూఢిల్లీలో జరిగిన సుజుకి ఆల్ ఇండియా డీలర్ సదస్సులో సుజుకి మేనేజింగ్ డైరెక్టర్ సంతోషి ఉచిదా చేతుల మీదుగా వరుణ్‌గ్రూప్ ఎండీ వరుణ్‌దేవ్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వరుణ్‌దేవ్ మాట్లాడుతూ పద్మజ సుజుకి రికార్డు స్థాయిలో సేల్స్‌ని సాధించడమే కాకుండా, కస్టమర్స్‌ను సంతృప్తి పర్చడంలో కూడా నెంబర్–1గా నిలిచిందన్నారు. దీంతో పద్మజ సుజుకి సేల్స్‌లో ఇండియాలోనే నెంబర్–1గా నిలవడం ఆనందదాయకమన్నారు. ఇంతటి విజయానికి కారణమైన కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈడీ వినోద్‌కుమార్, పద్మజ సుజుకి జీఎం ఎం.ఎస్.కె.రఫీ, సీఈఓ అనూరాధ(విజయవాడ), జీఎం ప్రవీణ్(హైదరాబాద్) పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి యువకుడి మృతి



మృతుడు మాధవ రెడ్డి

ఆనందపురం : మండలంలోని కొంత్యాం పంచాయతీ గుమ్మిడివాని పాలెం వద్ద సర్వీసు రోడ్‌లో ఆటో అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కైలాసపురానికి చెందిన కొండపు మాధవరెడ్డి పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా మంగళవారం ఉదయం మాధవరెడ్డి పెందుర్తిలో ఆటో ఎక్కి ఆనందపురం వైపు వస్తున్నాడు. ఆటో గుమ్మిడివాని పాలెం సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో మాధవరెడ్డికి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఆటో డ్రైవర్ గురునాయుడు గాయాలపాలయ్యాడు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.